కథానిక

# కళారాధకుడు

"ప్రణవానంద"

ఎప్పుడూ ఏదోలాగ శక్తిమంతుణ్ణి ఉపయోగించుకొంటూనే ఉంటుంది లోకం. వాడి కష్టసుఖాలతో దానికేం పని? లేకపోతే ఉద్యోగంలోంచి రిటైరయి, శాంతిగా కాలక్షేపం చేదామనుకొన్న మహాదేవం పంతులుగారికి మళ్లా సంగీత కళోద్ధరణ సమస్య ఏమిటి? అంతే. అది తప్పదు. ఆయన జీవితమే అంత. ఆయన ఉద్యోగ ధర్మంలో ఉంటున్నప్పుడు, అప్పుడూ అంతే. ఎవరో ఒకరు రావడమూ, అయ్యా! ఈ నాట్యకళా సమితి తమవల్ల నిర్వహింప బడాలనీ, ఈ పురమందిరానికి కార్యదర్శిత్వం వహించాలనీ, ఈ సారస్వత సభకు తమరు ప్రారంభోత్సవం జరపాలనీ, ఒకటేమిటి, ఎవరో ఒక కవీశ్వరుడు వచ్చి వదలకుండా ఒకే ధోరణితో పద్యాలు ప్రారంభించడం, లేదా ఒక సంగీత విద్వాంసుడు రావడం, తమపేరు వినే వచ్చామనడం; అవతల కత్తిమీద సామువంటి ఉద్యోగమే చూసుకోవడమూ, ఇటు వీళ్ళబాధే చూడడమూ? అయితే సమర్థుడు. శక్తిమంతుడు కాబట్టి అన్నిటినీ అలా అలా ఎక్కడుంచవలసినది అక్కడ ఉంచి, అన్ని కార్యభారాలను చదరంగపు ఎత్తులలాగ నడిపించుకొని వచ్చేవాడు. ఈనాడు యింతమంది తెలుగువాళ్ళు రైల్వేలో బ్రతుకుతున్నారంటే చాలునతనికి. వాళ్ళంతా తనకి అజన్మ కృతజ్ఞులు. కానక్కరలేదు. నేటికి ప్రవాసాంధ్రులందరూ ఇంత ఐకమత్యంతో ఉండి ఇన్ని ఘనకార్యాలు సాధించగలుగుతున్నారంటే, తను చేసిన పని వృథా కాలేదనిపిస్తుంది; అంతే.

ఇలాంటివన్నీ మీద వేసుకోకపోతే, గడవదా తనికి? తన తండ్రిగారు డిస్ట్రిక్టు కలక్టరీ చేశారు. తన మామగారు రావుసాహెబు. వియ్యంకులు అల్లుళ్లు అటూ ఇటూ అందరూ గెజెటెడ్ ఆఫీసర్లు వారి వంశం అలాటిది; వారి గౌరవం అంత ఉన్నత మయినది.

నిజం చెప్పవద్దూ, మహాదేవంగారికి ఈ సంగీతాలన్నా, సాహిత్యాలన్నా అసహ్యం. కారణం ఉంది. ఎందుకూ పనికి రాకపోతే సంగీతం, కొంచెం కొస వెర్రి ఉంటే కవిత్వం, అని ఆయనకు తెలుసును. ఇక సంగీతం వాళ్లకి తిన్నగా అక్షర జ్ఞానమయినా ఉండేది కాదు కదా. దానికి తోడు భంగు, గంజాయి, పీత్వాయిత్యాది పద్ధతి. ఇక వెనక శిష్యబృందమూ మంగలి వాళ్ళూ సానివాళ్ళూను. గాన విద్య ఘనమయినదే. ఆ విషయం ఆయనకి తెలియనిది కాదు. అయితే దాన్ని అవలంబించే వాళ్ళలోనే ఉంది లోటంతాను.

మొదట్లో ఆయన ఏనాడూ ఈసంగీత కళోద్ధరణకూడా తనవల్ల జరగవలసి ఉందని ఆయన ఊహించనయినా లేదు. అదివారి పంథా కానే కాదు. కేవలం కళాపోషణే కాని, కళతో అంతకంటే సన్నిహితమయిన సంబంధం ఏర్పరచుకోనే ఇచ్ఛ లేనేలేదు.

రిటైరవడాన్ని అక్షరాలా పాటించదలచుకొని, వేటితోనూ ఆయన జోక్యం కలిగించుకోకూడదని నిశ్చయించుకొన్నాడు. ఏమిటి చెప్పండీ, తనతోటి రిటైరయిన వాళ్ళంతా చేస్తున్న పని? ఏ క్లబ్బులోనో, ఊరికే పొల్లు దంచినట్టు రాజకీయాలు మొదలూ తుదీ లేకుండా చర్చిస్తూ ఉండడమేకదూ? లేకపోతే పోయి ఏ స్వాములవారి కాళ్ళమీదో పడడం. ఎందుకు చెప్పండీ ఈ వేషాలన్నీ వట్టి భేషజం కాకపోతే.

ఇటువంటి వికారాలు లేకపోయినంతలో తనకేం కాలక్షేపం కాకపోతుందా? ఎక్కడికీ వెళ్ళవలసిన అవసరం తనకిలేదు. పదిమందితో ఏపని మొదలెట్టినా వట్టి చావల్ ఖరాబీ అయిపోక తప్పదుకదా! ఇంతకీ వాటివల్ల తనకి ఒరిగి పోయేదేమీ లేదు. అయితే ఎలాగో ఆ కాలం గడవాలి. కేవలం గ్రంథ పఠనం

శారీరకంగానూ మానసికంగానూ శ్రమతో కూడిన పని. ఏదో వార్తా పత్రికలు, తేలికైన నవలలూ వంటివి ఒక గంటో రెండు గంటలో అయితే బాధలేదుగాని, రోజంతా ప్రధానంగా గడపడం ఎలాగ? ఏదైతేనేమని నిత్యం ప్రధానంగా కాలక్షేపానికి స్వగృహంలోనే, స్వబంధుకోటితోనే పేకాట ప్రారంభించారు. ఇన్ని బందుకట్లలో ఉన్నా సంఘం తనలోకి లాక్కుంది పంతులుగారిని సంగీతం మిషతో. తనలాటి ప్రయోజకుణ్ణి వదులుకోలేదు. లేకపోతే ఈ మహా కార్యాలన్నీ ఇంత తిన్నగా నడవడం ఎలాగ?

అయితే ఈ వలలో ఆయన ఎలాపడ్డాడు? ఏమీ లేదు, ఒక పదేళ్ళ పిల్ల తన మనమరాలు కారణం అయింది. ఉన్నట్టుండి అమాంతంగా సరస్వతీ అపరావతారం తన ఇంట్లోనే మనమరాలి రూపంతో ఆవిర్భవించినట్లు వెంటనే కనిపెట్టేశాడు. అసలు ఈ వింత ఏ విధంగా జరిగింది?

మధ్యాహ్నం భోజనాంతరం కొంతసేపు విశ్రమించడం అనే అలవాటు తెలియకుండానే ప్రారంభమయింది రిటైరయిన అనంతరం. మరో చికాకు లేకపోవడంవల్లా, తన ప్రస్తుత స్థితికి కొంతవరకు అలంకారంగా ఉండడంవల్ల ఈ కార్యక్రమం అవిఘ్నంగానే నడుస్తున్నది.

ఆవేళ ఆయన ఇంకా నిద్రావస్థలోనే ఉన్నాడు. ఏదో ప్రభావంవల్ల ఆయన జాగ్రత్త స్థితికి రావడం జరుగుతున్నది. గానానికిమాత్రమే ఆ శక్తి ఉంది. అయితే ఎక్కడనుండి వస్తున్నది ఈ గాన ప్రవాహం? ఈ మాధుర్యం ఎవరి కంఠానికుంటుంది? అవతల పెరటి వసారాలో పాడుతున్నట్టు వినిపిస్తున్నది.

పూర్తిగా మెలకువ వచ్చింది, ఉండబట్టక అడిగేడు భార్యని, నిజంగానే విన్నానా లేక కలగన్నానా అన్న సందేహం తీర్చుకొందికి. ఆవిడ "పాటా? ఇంకెవరూ, మన ఇందిరే" అంది. ఆయన మంచంమీద లేచికూర్చుని, "ఏమిటీ ఇందిర పాడుతుందీ? ఎప్పటినుంచీ?" అని ప్రశ్నించారు. "ఎప్పటినుంచీ అంటే ఏముంది? అదుగో ఎదురింటి ప్లీడరు గారి కూతురు సంగీతం చెప్పుకొంటున్నది, యెవడో ఆ మేస్టరు చెప్తున్నాడు. వేళయేసరికి ఇదీ పోతుందక్కడికి. ఇక ఆ స్వరాలూ పాటలూ ఒకటే గొడవ. ఏ పెట్టె కనిపించినా, దాని మీద ఉత్తుత్తి హార్మోనియం వాయించడమే."

"ఏమిటీ ప్లీడరుగారి పిల్ల అంటే రామనాథం మనమరాలేమిటి?"

"అదేనూ, వాళ్ళ రవణ. అదీ దాని సంగీతమూ రెండూ ఒక్కలాగున్నాయి. దాని కంటే ముందు దీనికే వస్తాయట పాటలు. అసలు దాని గొంతుక్కూడా బాగుండదు. ఆ మేస్టరు ఎప్పుడూ అంటూ ఉంటాట్ట "అమ్మా నువ్వు నేర్చుకో" అని.

పంతులుగారికంతా అవగతమయింది. "అదీ సంగతి. అందుకే దానికి చదువుమీద దృష్టి లేదు. సరి, సరి. దాని తెలివితేటలే ధోరణిని రాణిస్తాయో ఆ పనే చేయిద్దాం. అసలు మన దేశంలో ఉన్న దౌర్భాగ్యమే ఇది. పిల్లల బుద్ధి యెందులో ప్రసరిస్తుందో ఆ విద్యలో ప్రవేశపెట్టరు. సరే ఈ విషయాలన్నీ నీకు తెలియవులేగాని, మన ఇందిరకి కూడా సంగీతం చెప్పిద్దాం మంచి రోజు చూసి."

మర్నాడు సంగీతం మేస్టరు వచ్చాడు.

సుబ్రహ్మణ్యాన్ని చూడగానే ఆయనకి జాలి కలిగింది. లేకపోతే పిల్లకి సంగీతం చెప్పించాలన్నంతటి ప్రారబ్ధమేమిటి తనకి?

"ఏం పంతులూ, ఎవరిదగ్గర విద్య అభ్యసించావు?" పిల్లని చదివించే ముందు మాస్టరుగారి అర్హతలు తెలుసుకోవడం అవసరంకదూ.

"చిత్తం, వల్లభస్వామిగారివద్ద కృషి చేసేనండి. నేనేకాదు, ఈ ప్రాంతం అంతా వారి శిష్య ప్రశిష్యులేనండి. వారు పెట్టిన భిక్షే."

"ఎవడు వల్లభస్వామీ, త్వాష్ట్రింలా పొడుగ్గా ఉంటాడు, మెళ్లోరుద్రాక్షకాయలూ, చేతికి బంగారం కడియం అతనేనా?"

మరొక సందర్భం అయితే ఈ రకం గురునిందకు సుబ్రహ్మణ్యం ఘాటుగా సమాధానం చెప్పి ఉండేవాడే. అయితే ఒక మాటకోసం, మంచి ట్యూషన్ పోగొట్టుకోవడంలోని తెలివితక్కువ తెలిసినవాడు గనక ...

"చిత్తం చిత్తం, తమకు తెలియనిదేముంది? వారి ఉపదేశం మాహాత్మ్యం అలాటిది. నా

లాటివాళ్ళం అనేకులం వారికి ఋణపడి ఉన్నాం. దక్షిణాది విద్వాంసులుకూడా వారి ఘనతని అంగీకరించినవారే మన దేశంలో అంతటిలోనూ."

"సరే సరే, వల్లభస్వామి శిష్యుడవన్న మాట" పంతులుగారికి సుబ్రహ్మణ్యం సంకీర్తనం చికాకు కలిగించి, మధ్యలోనే దారిలోకి తీసుకొని వచ్చేరు. అసలు వల్లభస్వామిగారు ఒకమారు తను ఉద్యోగ ధర్మంలో ఉంటున్నప్పుడు, వచ్చేరు ఆ ప్రాంతం. ఆయన యోగ్యత తనకేం తెలియనిది కాదు. అయినా ఈ కుర్రవాడు పెద్దలవద్ద అంతగా ఇన్ని మాటలు పేర్చడం అనవసరం.

"సరే పంతులూ మా మనవరాలు సంగీతం చెప్పుకొంటా నంటున్నది. ఒకమారు రోజూ వస్తూ ఉంటూవుకదూ, దాని స్కూలు వేళకి అడ్డులేకుండాను. నీకూ విద్యాసాధన అవుతూ ఉంటుంది. బోధనా పాటవంకూడా కుదురుతుంది."

సుబ్రహ్మణ్యానికి పంతులుగారి కలహం కొంత ధైర్యాన్ని కలిగించింది. పెద్దవాళ్లు అలా మాట్లాడితేనే బాగుంటుంది. తనా ముందుకి రావలసినవాడు. ఇంతకీ తన సంగీతంలాంటి విద్యలకి పెద్దల ఆశ్రయం ముఖ్యం ఎంతయినా అవసరం. ఆయన అన్నమాట లన్నిటకీ పట్టింపు చేసుకొంటే ఎలాగ?

ఇందిర సంగీతం ప్రారంభించిన దగ్గరనుంచీ పంతులుగారి దినచర్యలో మార్పు వచ్చింది. అమ్మాయి సంగీత సాధన ఆయన కనిపెటడం ప్రారంభించారు. ఏరోజు పాఠం ఆరోజు వల్లింపజేయడం, అలాగని సాధన ఎక్కువయి ఆరోగ్యం చెడిపోకుండా చూడడం, ఇవన్నీ ఆయనకి అవసరంగానే కనిపించాయి.

అంతేకాకుండా ఆయనకి చాలా సందేహాలు కలిగేవి. సరిగమ పదనిస అనే ఎందుకనాలి? ఏడే స్వరా లెందుకుండాలి? రాగం పాడేటప్పుడు తరెన అని మాత్రమే ఎందుకనాలి? ఈ మొదలయిన సందేహాలు సయుక్తికంగా తీర్చగల సామర్థ్యం ఏదీ సుబ్రహ్మణ్యం దగ్గర? సంప్రదాయానుసారంగా, లక్ష సంగీతం లక్షణ విరుద్ధంకాకుండా, శ్రుతి పక్వంగా గానం చేయడం మాత్రమే తెలుసును. అదీ కాక పంతులుగారికి కలిగే సందేహాలవంటివి అతనికెప్పుడూ కలిగేవి కావు.

ఒకమారు పంతులుగారు అడిగేరు, "పంతులూ త్యాగయ్యగారు ఏ సంవత్సరంలో జన్మించేరో తెలుసునా?" అని. ఆనాటికింకా ఇప్పటంతటి శాస్త్రాభివృద్ధి ఏదీ? ఈనాడంటే సంగీత పరీక్షలలో నూటికి యాభైమార్కులు పాటకి కాకుండా మాటలకే ఉండడం మూలాన, త్యాగయ్యగారి జన్మస్థలం ఏమిటి? ఆయన పుట్టినతేదీ, గిట్టినతేదీ, ఎప్పూడెప్పూడేకీర్తనలు రాసేరో, ఎన్నికీర్తనలు రాసేరో, ఇంకా త్యాగయ్యగారి మాటకేం సామాన్యంగా ఎవళ్ళూ విననిని, ఎంతమంది సంగీతజ్ఞుల చరిత్రలో తేదీలవారీగా చెప్పగల విద్వాంసులు ఉమ్మడిగా కనబడుతున్నారు ప్రతి గ్రామంలోనూ. అసలు యెన్నెన్నిరకాల వాద్యాలున్నాయోకూడా పూర్వపు సంగీత పండితులకి తెలిసేది కాదు. ఇప్పుడు యెన్నిరకాల వాద్యాలున్నాయో ప్రతివాద్యం తయారీ ఎక్కడో దాన్ని ఎవడు కనిపెట్టాడో వాడి జీవితచరిత్ర, ఆ వాద్యానికి ఏ జంతువు నరాల తంతులు వేస్తారో అన్నీ క్షుణ్ణంగా వల్లెవేసిన డిప్లమో హోల్డరని అనేకుల్ని చూడగలుగుతున్నాము. ఆనాడు అంటే పాతికసంవత్సరాలక్రితం ఇంత శాస్త్రాభివృద్ధి ఏదీ? వాళ్ళ దృష్టి ఎంతసేపూ పాటపాడడం, వీణ వాయించడం, దాంట్లో తన్మయత్వం చెందేమనడం- అంతవరకే వుండేది.

సుబ్రహ్మణ్యం నిజంగా సిగ్గుపడ్డాడు, పంతులుగారు వేసే ప్రశ్నలకి తను సరైన సమాధానాలు చెప్పలేకపోయినందుకు.

పంతులుగారికి తెలుసును, తన సందేహాలు సామాన్యుల వల్ల తీరవని. తనకి తనే గ్రంథావలోకనం ప్రారంభించారు. చిన్నతనంలో చదువుకొన్న సంస్కృతం యిప్పుడు ఉపయోగంలోకి వచ్చింది. అటు వేదకాలం నుండి నేటి అధునాతన పద్ధతి వరకూ సంగీత పరిణామం అంతటినీ పరిశోధించసాగారు. ఒక పద్ధతి అంటూ ఏర్పడిన తరవాత మరి ఆయన ఓపికకి అంతు లేకపోయింది. శాస్త్ర సమాలోచన ప్రారంభించిన దగ్గరనుండీ పేకాట

మానివేయడమే కాదు, మధ్యాహ్నం భోజనానంతరం తీసే నిద్రకికూడా సావకాశం లేకండా జరగసాగింది శాస్త్రాన్వేషణ.

ఈ సందర్భంలో సుబ్రహ్మణ్యం ఆయనకెంతో ఋణపడి ఉన్నాడు. ఎన్నెన్నో అపూర్వ, అంటే ఇటీవల విస్మరించబడిన సంగీత గ్రంథాల పేర్లు చెప్పేరు పంతులుగారు. అంతేగాదు. ఎంతమంది విద్వాంసులు ఏయే కాలాల్లో ఎన్నెన్ని రచనలు చేసేరో, యిటీవలి విద్వాంసులు శాస్త్రాన్ని ఎంతగా పాడుచేస్తున్నారో, అన్నీ కరతలామలకమయేయి ఆయనమూలంగా.

ఇక ఈ తెలుగు దేశంలో మనవరాలికి సశాస్త్రీయంగా విద్య చెప్పగలవాడు ఆయనకి కనబడలేదు. తిన్నగా మద్రాసు పంపేరు మనుమరాలిని. తామూ కొంతకాలం ఆరోగ్యానికి సముద్రతీరం బాగుంటుందని అక్కడ నివాసం ఏర్పాటు చేసుకొన్నారు.

తరవాత ఆయన చేసిన పని గురించి విశేషించి చెప్పనక్కర లేదు, అది జగద్విదితమే. స్వగ్రామంలో ఒక సంగీతమండలి స్థాపించి, దానికి స్వయంగా అధ్యక్షత వహించి, నిర్మాణ కార్యక్రమం నిబ్బరంగా ప్రారంభించారు. ప్రతి సంవత్సరం తప్పకుండా త్యాగబ్రహ్మోత్సవాలు ఏర్పాటుచేయడం అన్నది వారికి తెలిసినంతలో వారే ప్రారంభించేరు. ఒకరు చేసిన తరవాత, అనుకరించడానికేముంది, చాలా మంది చాలా గ్రామాలలో చేస్తున్నారు ఇటీవల. కాని, మార్గదర్శకత్వపు కీర్తిమటుకు వారికే దక్కాలి న్యాయంగా మరి.

ఆరోజుల్లోనే ఆయన సంగీత కళాపరిషత్తు అంటూ ఒకటి ఏర్పాటు చేయించి, దానిలో అనేక తీర్మానాలు చేసేరు.

(1) విద్వాంసులు సభ ఒక్కంటికి నూటపదహారు కన్న ఎక్కువ పుచ్చుకో కూడదు.

(2) సభలలో తమ స్వంత రచనలు (అవి తప్పకుండా అసభ్యమయినవే అయి ఉంటాయి కనక) గానం చేయరాదు.

(3) జనరంజకం కోసం తాపత్రయపడి విద్వాంసులు శాస్త్రానికి ద్రోహం తలపెట్టరాదు.

(4) తక్కిన గొప్ప వాద్యాలకు అంతో యింతో దెబ్బ తగులుతుంది గనుకనూ, ప్రజలకు నూత్నంలో ఆనందం కలిగించి విశేష పరిశ్రమకి తావియ్యకుండా ఉంది గనుకనూ, హార్మోనియం దేశం నుండి బహిష్కరించాలి.

ఇట్టి మహత్తర తీర్మానాలు ఎన్నో తీర్మానించబడ్డాయి ఆయన అధ్యక్షతను.

అంతతో ఊరుకో లేదు. నేటి సంగీత విద్వాంసులచేత విస్మరింపబడినవీ, సామాన్యంగా దురూహ్యము అయినవీ అయిన అనేక విషయాలు పత్రికాముఖంగా వెల్లడించేరు.

ఏదో కచేరీలు చేసుకొని బతికే కేవల విద్వాంసులకి శాస్త్రాభివృద్ధి చేసే అర్హతలు ఏనాడూ లేవు. ఈ విషయం కనిపెట్టి పంతులుగారు ఆభారం వారిమీద వేసుకొని, అనేక మార్గాలు తొక్కదామనుకొన్నారు. త్యాగయ్యగారి కీర్తనలకి భాష్యం వ్రాయిద్దామనీ, సంగీత లక్ష్య రచనలలోని అసభ్య సాహిత్యాలు మార్పు చేయించి, భక్తి రస ప్రధానమయిన సాహిత్యాలు రచింపచేద్దామనీ, దేశంలో ప్రతి గ్రామంలోనూ క్షుద్ర సంగీత నిరసనమూ, శాస్త్రీయ సంగీతాభిమానమూ నయానా భయానా కలిగిద్దామనీ చాలాచాలా అనుకొన్నారు. అనుకొన్నదంతా చెయ్యలేకపోవడం, మానవ మాత్రులందరికీ ఉండేదే. అదొక పెద్ద లోపంకాదు. అయితే వారి యీ ఆశయాలన్నీ అధికారవర్గాల ద్వారా నేడు అమలులోకి రావడం ఆయనకి చాలును. తానే చేసేకన్న కీర్తికోసం పాకులాడ నక్కరలేదు. అయితే ఈ రకం కార్యక్రమం ఏనాడో ప్రారంభించినవాడు ఆయన అన్నది తద్జ్ఞులకు తెలుసును.



అయినా ఎవరో వచ్చి ఆహ్వానించినప్పుడు, ఈ కదలలేని వృద్ధాప్యంలో కూడా, సంగీత సభలకి ప్రారంభోపన్యాసాలు చేస్తూవుండడం, అమూల్యమయిన వారి సలహాలు విద్వాంసులకి లభింపచేయడం మానలేదు. అసలు మానలేరు. వారు వేసినవిత్తు దినదిన ప్రవర్ధమానమాతుంటే చూసి ఆనందించకుండా ఉండడ మెలాగ?

నేటికి వారి కుటుంబమే సంగీత కుటుంబం అయిపోయింది. ఈనాడు వారంతా రేడియోలలోనూ సభలలోనూ (సభికులకు కొస్త కష్టంగా ఉండేలా అయితేనేం) గానంచేసి ప్రజలని నీచ కళాభిరుచినుండి తప్పిస్తున్నారు.

ఏ విద్వాంసులు గ్రామంలోకి వచ్చినా అక్కడ బసచేయాలి. దక్షిణాది విద్వాంసులందరూ పంతులుగారి శాస్త్రీయ విమర్శనా పాటవానికి తలలొగ్గినవారే.

అంతా ప్రశస్తంగానే ఉంది. అయితేఎంత ప్రఖ్యాతులకయినా స్వంత ఊళ్ళో కొంత అపఖ్యాతి తప్పనట్టు, ఆ ప్రాంతాలలోని, కేవల సంగీత విద్వాంసులు కొందరు సమయం దొరికినప్పుడల్లా అంటూ ఉంటారు, "పంతులుగారికి శుష్కమయిన పుస్తక జ్ఞానం తప్ప, నిజమయిన సంగీత కళాభిరుచిగాని, అనుభవంగాని లేద"ని. ఏ కారణం లేకుండా, ఎదురుగా వచ్చి ఎటువంటి దుర్భాషలాడినా కలుగని కోపం కలుగుతుంది పంతులుగారికి ఇటువంటి క్షుద్రవాక్కుల గురించి తెలుసుకోవలసి వచ్చినప్పుడు. అయితే అంత ఆగ్రహం రావడానికి అవి చాలావరకు యథార్థం కావడమే కారణమేమో!

ఆయనకయితే తెలుసును, నేటివిజ్ఞానశాస్త్రజ్ఞులలోకూడా గొప్పగొప్ప సిద్ధాంతాలు కనిపెట్టినవారు కొందరు, తమ శాస్త్రజ్ఞానం అంతా పుస్తకాలతోనూ, లెక్కలతోనూ ఊహాలతోనూ ఆగిపోయి, నిత్యసామాజిక జీవితంలో తమ సిద్ధాంతాల ఉపయోగం ఏ విధంగా ఉన్నది అన్న దాంతో సంబంధంలేని వారుంటారనీ, ఐనా వారికి శాస్త్రవేత్తలలో ఉండే స్థానం సర్వోత్తమ మయినదనిన్నీ.

అయితే ఆయా అంశాలు ఈ కేవల సంగీత జడులకు తెలియవు కద. తెలియక పోయినంతలో తనకు మహానష్టమని కాదుగాని, ఇంత చేసినపనినీ, ఇదేదో అసందర్భమూ అక్రమమూ ఐన క్షుద్రకీర్తి కాంక్షగా ప్రచారం చేస్తుంటే చేసుకోనీ. తానేం మరీ అంత అజ్ఞాని కాదు. "కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన" ఇత్యాది గీతావాక్యాలు ఎల్లప్పుడూ స్మృతి పథంలో మెదల్తూనే ఉన్నాయి. తన కృషి దేశంలో సహజ కళాభిరుచిని వెనక్కునెట్టి, శుష్కపుస్తకజన్య జ్ఞానానికి దోహదంచేసిందనే వాళ్లకి తాను సమాధానం చెప్పలేక కాదు; తాను ఒక్క వ్యాసం రాసిపారేస్తే బహు పత్రికలు ప్రచురిస్తాయి, పలువురు పెద్దలు ఆమోదించక పోరు. గాని, తానునిజంగా చెయ్యవలసిన పని ఏదో అయిపోయింది. ఇప్పుడీ క్షుద్రవాదోపవాదాలు పెట్టుకొని మనస్సుకలిసివచ్చినా శరీరం కలిసివచ్చేస్థితిలో లేదు, వేళ్ళు వణుకుతున్నాయి; దృష్టి సరిగా ఆనడంలేదు. సరే. దానికేమి, ఎవరినో దగ్గర పెట్టుకొని రాయించినా ఫలితార్థం ఏమవుతుంది? నీటికి నాచు తెగులు, మాటకి మాట తెగులు గనక ఒకమాటఅంటే, ఎదురు పదిమాటలు లేచివస్తాయి వాటిలో అర్థం ఉన్నా లేకపోయినాను. అయినా ప్రస్తుత స్థితిలో ఇటువంటివాటికి చాలా అనీతుడుగా ఉండడమే తనవంటి ప్రామాణిక పండితుడు చెయ్యవలసిన పని. బుద్ధిచేత ఆలోచించి చేసుకొన్న ఈ నిశ్చయానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉండలేకపోయేది మనసు. అందుకే యత్కించిద్విచారం.

ఏమైనా ఆయన మహానుభావుడు. కళోద్ధారకుడు. ఒక సంఘము అంటూ ఏర్పడి వ్యవహారతరంగా మెలగే శక్తిలేని, సంగీత విద్వాంసులు చాలామందికి, బహుప్రజలనడుమ గానం చేయడానికి సావకాశం కల్పించిన వాళ్ళలో ఆయన ఒకడు. ఆయన సంగీత విమర్శనా వ్యాసాలు మున్ముందు సంకలిత గ్రంథాలయి, విశ్వవిద్యాలయ పట్టపరీక్షలకి పాఠ్యగ్రంథాలుగా నియమింపబడి కళకి మెరుగులు దిద్దక పోయినా, చక్కగా ఎటునుండీ గాలి తగలకుండా బందుకట్లు బిగించి, క్షుద్ర వాసనలకూ సంస్కారాలకూ దూరంగా నిలబెట్ట గలవు! అంతకంటె ఒక మహా కళోద్ధారకుడికి వాంఛనీయమయిన దింకేముంటుంది?